సాక్షి
జనగామ

మంగళవారం | 20 | జూన్ | 2023



జీపీ కార్యాలయానికి తాళం

సర్పంచ్ కుమారుడి ఆగడాలపై ఆగ్రహం చెందిన మూలమర్రితండా ప్రజలు జీపీ కార్యాలయానికి తాళం వేశారు. - 8లో▸



ఐటీఐ.. చదువులో మేటి

ఐటీఐలకు ఆదరణ పెరుగుతోంది. అప్రెంటిస్ నియామకాలు మెరుగ్గా ఉండడంతో సాంకేతిక విద్యపై ఆసక్తి పెరుగుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



నర్మెట : సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి పొందవచ్చని యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త మధుశేఖర్ అన్నారు. సోమవారం మల్కపేటలో సేవాలాల్ సేన మండల కమిటీ ఆధ్వర్యంలో ధరావత్ రమేష్ అధ్యక్షతన ప్రకృతి సేద్యంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో పొలాల్లో జీలుగ అలుక్కోవడంతో పాటు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఉప సర్పంచ్ బాల్‌సింగ్, ఏఈఓ వరలక్ష్మి, సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్, బానోత్ సురేష్, సుమన్, రవీందర్, రామన్న, సురేష్, ప్రవీణ్, లాలు పలువురు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి



జనగామ రూరల్: ధరణి సమస్యలు పరిష్కరించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంతో పాటు అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలు అందించాలని, భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు పంటల సాగుపై శిక్షణ కల్పించాలని చెప్పారు. 50 ఏళ్లు నిండిన వారికి రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చొప్పరి సోమయ్య, ఎం.జనార్దన్, గుర్రం మధు, శంకర్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీసు



జనగామ రూరల్: గ్రామాల్లో అనేక సేవలు అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు బత్తిని వెంకన్న డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి సమ్మె తప్పడంలేని పేర్కొన్నారు. అనంతరం డీపీఓ కార్యాలయం ఏఓ వసుంధరకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారోజు రామచంద్రం, కోశాధికారి ములుగు రామనారాయణ, సందీప్, వెంకట్‌రెడ్డి, ఉప్పలయ్య, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేయాలి



జనగామ రూరల్: హైదరాబాద్ హైవే నుంచి దుద్దెడ వరకు 365బి హైవే ఫోర్‌లేన్ రోడ్డులో భూమిని కోల్పోతున్న రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదిర్శ భూక్య చందు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ హైవే నుంచి దుద్దెడ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం కోసం 4 కిలోమీటర్లు భూమి సర్వే చేశారని, ఇందులో 75 మంది రైతులు రూ.కోట్ల విలువ చేసే భూమిని కోల్పోతున్నారని చెప్పారు. జనగామ పట్టణ పరిధిలో ఎకరాకు రూ.90 లక్షల చొప్పున, శామీర్‌పేట పరిధిలో రూ.42 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ధరలు నిర్ణయించి ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చినా ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. తక్షణమే ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మంగ బీరయ్య, శ్రీనివాస్, కర్రె రాములు, అంజనేయులు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'విద్యా' పండుగ

- నేడు 'మనఊరు–మనబడి' పాఠశాల ప్రారంభం
- అందుబాటులోకి రానున్న డిజిటల్ తరగతులు, లైబ్రరీ సేవలు
- జిల్లా వ్యాప్తంగా జాతీయ జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు
- దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొననున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రారంభానికి సిద్ధమైన లక్ష్మక్కపల్లి పాఠశాల

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వివరించేందుకు మంగళవారం 'విద్యా దినోత్సవం' నిర్వహిస్తున్నారు. కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఆధ్వర్యంలో డీఈఓ రాము నేతృత్వాన జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి జాతీయ జెండాల ఆవిష్కరణ, ర్యాలీలు చేపట్టనున్నారు. మండలాల పరిధిలో వేడుకలు పూర్తయిన అనంతరం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో విద్యా దినోత్సవ వేడులకు నిర్వహిస్తారు.

ప్రారంభోత్సవాలు..

'మనఊరు–మనబడి' కార్యక్రమం కింద ఎంపికైన కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి, జీబీతండా, మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే నూతన డిగ్రీ కళాశాల, పాలకుర్తి ఉన్నత పాఠశాల 8, 9, 10 తరగతుల్లో డిజిటల్ తరగతులను రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించనున్నారు. జనగామ మండలం సిద్దెంకి, తరిగొప్పుల పీఎస్‌లతోపాటు, ఉన్నత పాఠశాల 8, 9, 10 క్లాస్‌ల డిజిటల్ తరగతులను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధి ఇప్పగూడెం ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు, ప్రాథమిక పాఠశాలలో లైబ్రరీ కార్నర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రారంభించనున్నారు.

అందుబాటులోకి కొత్త సేవలు..

జిల్లాలోని 1 నుంచి 5 తరగతులకు చెందిన 152 ప్రాథమిక పాఠశాలల్లో లైబ్రరీల(రీడింగ్ కార్నర్) సేవలు మంగళవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఇందులో పిల్లలు కూర్చుని చదువుకునేందుకు 152 కార్పెట్లు, ఒక్కో స్కూల్‌కు 259 బుక్స్, ఉడెన్ ర్యాక్స్ వచ్చాయి. లీజర్ పీరియడ్‌లో పిల్లల తరగతి సామర్థ్యాన్ని పెంపొందించేలా ఈ బుక్‌లతో అవగాహన కల్పిస్తారు. అలాగే జిల్లాలోని 52 ఉన్నత పాఠశాలలు.. 171 తరగగతి గదుల్లో(8, 9, 10) డిజిటల్ తరగతులను ప్రారంభిస్తారు.

ఇందుకు ప్రభుత్వం మూడు క్లాసులకు ఒక్కో టీవీ చొప్పున ఏర్పాటు చేయడానికి రూ.8.57 కోట్లు కేటాయించింది. విద్యార్థులకు డిజిటల్ ప్రత్యక్ష తరగతులతో పాటు అవసరమైన సమయంలో టీవీని బోర్డుగా ఉపయోగించుకుంటారు. తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలను సైతం అప్‌లోడ్ చేసి టీవీ ద్వారా మోడ్రనైజ్డ్ సిస్టంలో బోధన చేస్తారు. 315 ప్రాథమిక, యూపీఎస్ పాఠశాలలకు 318 మినీ ట్యాబ్‌లు మంజూరయ్యాయి. వీటితో పాఠశాలల్లో పేపర్ లెస్ సేవలను నేటి నుంచి ప్రారంభిస్తారు.

సత్కారం

12 మండలాల నుంచి ఉత్తమ టీఎల్ఎంల ప్రదర్శన, విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 68 మంది విద్యార్థులతో పాటు 10 మంది హెచ్ఎంలు, 15 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు తల్లిదండ్రులు, ఆరు ఎస్ఎంసీ కమిటీలు, ముగ్గురు దాతలను సత్కరిస్తారు. టీఎల్ఎల్ఎంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రతి సబ్జెక్టులో ప్రథమ, ద్వితీయ స్థాయిలో 10 అవార్డులు అందజేస్తారు.

గ్రామ స్థాయిలో..

విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ర్యాలీలు నిర్వహిస్తారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తూ నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ నమోదయ్యేలా చూడాలి. విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రణాళిక తయారు చేసుకోవాలి. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తల్లిదండ్రులను ఉద్దేశించి రాసిన లేఖలను పంపిణీ చేసి దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన ప్రగతిపై ముఖ్య కూడళ్లలో నాటకాల ప్రదర్శన చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలి.

పాఠశాల స్థాయిలో..

పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించి, అందమైన ముగ్గులు వేయాలి. నిర్ణీత సమయంలో జాతీయ జెండా ఎగుర వేయాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఎస్ఎంసీ కమిటీలు, సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు పాఠశాల స్థాయిలోని అందరిని వేడుకలకు ఆహ్వానించాలి. ప్రతి స్కూల్‌లో టాపర్లను సత్కరించి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాం అందించాలి. తెలంగాణ కవుల రచన లపై మండలం, జిల్లా స్థాయిలో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.

విద్యా ప్రగతిని చాటాలి..



విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో సాధించిన విద్యాప్రగతిని చాటాలి. కార్యక్రమానికి మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారు. ఉదయం 7.00 గంటలకే ఉపాధ్యాయులు, ఆయా కేటగిరీల అధికారులు చేరుకోవాలి. ఎజెండాను అనుసరించి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరుగుతున్న తీరు, ప్రభు త్వ సహకారం తదితర విషయాలను తల్లిదండ్రులకు చేరవేయాలి.

- రాము, డీఈఓ జనగామ

మోడల్ స్కూల్‌లో బోరు నీరే దిక్కు

- పాడైపోయిన ఫిల్టర్ మోటారు
- నిధుల కొరతతో నిర్వహణ అవస్థలు
- అధికారులకు పట్టని చౌడారం మోడల్ స్కూల్
- సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు



పనిచేయని వాటర్ ఫిల్టర్

జనగామ రూరల్: ఆంగ్ల బోధన.. మెరుగైన వసతులు, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందిచాలన్న గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. అయితే అన్ని రకాల వసతులతో ముందుకెళ్లాల్సిన ఆదర్శ పాఠశాలలో కనీసం మంచి నీరు కూడా లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మండల పరిధి చౌడారం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 450 మందిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ మోటారు కొన్ని రోజుల క్రితం పాడైపోయింది. దానికి మరమ్మతు చేయించడానికి సైతం నిధులు లేకపోవడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు బోరు నీటితో కాలం వెల్లదీస్తున్నారు. మూడేళ్ల నుంచి పాఠశాలకు రావాల్సిన నిధులు పూర్తి స్థాయిలో రాకపోవడం, పెరిగిన నిర్వహణ ఖర్చుల మేరకు నిధులు కేటాయించకపోవడంతో అరకొర వసతులతో నెట్టుకు వస్తున్నారు. దీనికి తోడు పాఠశాలకు రావాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు సమయానికి చేరుకోలేక పాఠాలు కోల్పోతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా 'వాటర్ ఫిల్టర్ మోటారు పాడైందని, బాగు చేయించాలంటే రూ.10 వేల వరకు ఖర్చవుతుంది, అలాగే కరెంటు బిల్లు రూ.8 వేల వరకు వస్తున్నది.. చెల్లించలేని పరిస్థితి ఉంది.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు దరఖాస్తు చేశామని' తెలిపారు.



బోరు వాటర్‌తో నింపిన డ్రమ్ము

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్య తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జనగామ రూరల్: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని సామాజిక సేవకుడు మహమ్మద్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని పాఠశాలలు ఫిట్‌నెస్‌తో కూడిన బస్సులు నడిపేలా చూడాలని, వివిధ ఫీజుల పేరుతో అధికంగా వసూలు చేస్తున్న స్కూళ్లపై డీఈఓ చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రెహమాన్, జాకీర్‌పటేల్, యాకూబ్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ సర్కారు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

జనగామ రూరల్: తొమ్మిదేళ్లుగా బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్ సర్కారు.. ఎన్నికల నేపథ్యంలో కొత్త పథకాల పేరుతో మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గుజ్జుల నారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 54 శాతం ఉన్న బీసీలకు 'బీసీ బంధు' అమలు చేయకుండా రూ.లక్ష రుణం పేరుతో పలు రకాల షరతులు పెట్టి ఇబ్బందులపాలు చేస్తోందని ధ్వజమెత్తారు. నాయకులు కొంతం శ్రీనివాస్, బల్లా శ్రీనివాస్, అనిల్, వల్లాల వెంకటేష్, సంపత్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ హత్యలో ఎమ్మెల్యే హస్తం

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య ఉదంతంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హస్తం ఉందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మెంబర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, దళిత వర్గానికి చెందిన రామకృష్ణయ్య బీఆర్ఎస్ పార్టీ నాయకుల అరాచకాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడంతోనే అంతమొందించారని అన్నారు. హత్యలు చేయడం సమస్యకు పరిష్కారం కాదని పేర్కొన్నారు. కబ్జాలు, భూదాహం వల్లే నియోజకవర్గంలో భూ సెటిల్మెంట్లు, అరాచకాలు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. హత్య కేసులో ఎమ్మెల్యేను సైతం చేర్చాలని డిమాండ్ చేశారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే హత్య జరిగేది కాదని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి : సీపీఎం

రామకృష్ణయ్య హత్య ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యదర్శివర్గ సభ్యుడు సాంబరాజు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కేసులో గిరబోయిన అంజయ్యతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార పార్టీ నాయకులపై హత్య, కుట్ర నేరం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. పరోక్షంగా హత్యకు కారకులైన బచ్చన్నపేట ఎస్ఐ నవీన్‌కుమార్‌ను విధుల నుంచి డిస్మిస్ చేయాలని, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నైతిక బాధ్యత వహించి అంజయ్య సతీమణిని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పదవి నుంచి బర్తరఫ్ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు బూడిద గోపి, జోగు ప్రకాష్, బోడ నరేందర్, బి.వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో తెలంగాణ నంబర్ వన్

- హరిత దినోత్సవంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జనగామ: పచ్చదనం పెంపొందించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం వడ్లకొండ ఇరిగేషన్ క్వార్టర్‌లో అటవీశాఖ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హరిత దినోత్సవం'లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి మొక్క నాటి, నీరు పోసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిధి గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటామని, ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. మొక్కల రక్షణకు ట్రీగార్డులకు బదులు ఖర్చులేకుండా.. మొక్కకు మూడు దిక్కులా 12 ఫీట్ల ముళ్ల కర్ర ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు వరి పంట కోసిన తర్వాత గడ్డిని పొలంలోనే తగుల బెట్టడం వల్ల గట్లపై ఉన్న చెట్లు కాలిపోతున్నాయని, అధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుంటే ప్రోత్సహించాల్సిన కేంద్ర సర్కారు ఒక్కపైసా నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బొట్ల శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ కొండల్‌రెడ్డి, డీఆర్డీఓ రాంరెడ్డి, డీపీఓ వినోద్‌కుమార్, ఇరిగేషన్ అధికారి కమలాకర్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ డీఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. హరిత దినోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పదుల సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో కొందరు కౌన్సిలర్లు సైతం అధికారుల తీరుపై మండిపడినట్లు సమాచారం. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఉత్సవాలు నిర్వహించడమేమిటని.. పురపాలిక అధికారుల తీరుపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిసింది.

ఆరు ఆలయాలకు 'ధూప దీప నైవేద్య' పథకం

లింగాలఘణపురం: మండల పరిధి ఆరు ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం కింద పూజారులను ఎంపిక చేస్తూ దేవాదాయ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పూజారితో పాటు నిత్య నైవేద్యానికి నెలకు రూ.6వేలు అందజేయనున్నారు. చిక్కులోని గూడెం అభయాంజనేయస్వామి ఆలయానికి కోకాల నాగేంద్రశర్మ, చీటూరు శివాలయానికి భాస్కరావైజుల వేణు, నెల్లుట్ల దాసాంజనేయస్వామి ఆలయానికి అద్దెంకి తాతాచార్య, బండ్లగూడెం లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి వరాయురు లక్ష్మీనర్సింహాచార్యులు, పటేల్‌గూడెం వేణుగోపాలస్వామి ఆలయానికి త్రిపురారి ప్రభుదత్త, వనపర్తిలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఆవునూరి సంతోష్‌లను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

- హరిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉంది.. భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి.. హరిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాలకుర్తిలో అటవీ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన హరిత దినోత్సవం కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో హరితహారం ఒకటని, 2015 నుంచి 2021 వరకు రాష్ట్రంలో ఫారెస్ట్ కవర్ 6.85 శాతం, అలాగే పచ్చదనం గ్రీన్ కవర్ 7.70 శాతం పెరిగిందని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 14,864 నర్సరీలు ఏర్పాటు చేయడంతోపాటు 273 కోట్ల 33 లక్షల మొక్కలు నాటామని పేర్కొన్నారు. హరితహారం నిర్వహణకు రూ.10,822 కోట్ల నిధులు వెచ్చించామని, జనగామ జిల్లాలో 2016 నుంచి ఇప్పటి వరకు 4,20,83,000 మొక్కలు నాటామని తెలిపారు. 281 జీపీల్లో నర్సరీలను గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాగల సంపత్‌రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, అటవీ శాఖ అధికారి వసంత, డీపీఓ రంగాచారి, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, పాలకుర్తి సర్పంచ్ యాకాంతరావు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, మార్కెట్ చైర్మన్ రాంబాబు, పసునూరి నవీన్, ఎర్రబెల్లి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన సిద్ధాంతాల పార్టీలకు స్వస్తి పలకాలి

దేవరుప్పుల: కాలం చెల్లిన సిద్ధాంతాలతో అధికారం కోసం వెంపర్లాడే జాతీయ పార్టీలకు స్వస్తి పలకాలని మంత్రి దయాకర్‌రావు అన్నారు. సోమవారం కడవెండికి చెందిన కాంగ్రెస్ నాయకులు పసునూరి సంపత్, సుధాకర్, నక్క కొమురయ్య పాలకుర్తిలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌తోపాటు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్, రైతు కోఆర్డినేటర్ లీనారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, మార్కెట్ డైరెక్టర్ భిక్షపతి, ప్రవీణ్, సోమయ్య, మహేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాజుపల్లికి పురస్కారం

దేవరుప్పుల: మండలంలోని సింగరాజుపల్లికి రాష్ట్ర స్థాయి 'హరిత' పురస్కారం లభించింది. హరితహారం విభాగంలో విస్తృత సేవలందించి పచ్చదనం కాపాడినందుకు ఐదవ స్థానంలో నిలిచింది. ఇందుకుగాను తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన హరిత దినోత్సవంలో హోం మంత్రి మహమూద్ అలీ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ గోపాలుదాసు మల్లేష్, కార్యదర్శి గొరిగె సంపత్ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఎంపీపీ సావిత్రిమల్లేషమ్, జెడ్పీటీసీ భార్గవిసుందర్‌రామిరెడ్డి, వైస్ఎంపీపీ విజయ్‌కుమార్, ఏపీఓ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.



పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ మల్లేష్, కార్యదర్శి సంపత్

హత్యా రాజకీయాలు చేస్తున్నారు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



పోచన్నపేటలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్రంలో రాక్షస తరహా పాలన కొనసాగుతోందని, అధికార పార్టీ నాయకులు హత్యా రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. హత్యకు గురైన రిటైర్డ్ ఎంపీడీఓ నల్లా రామకృష్ణయ్య కుటుంబ సభ్యులను సోమవారం పోచన్నపేటలో పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదురించిన వారిపై దౌర్జన్యం చేయిస్తూ చివరకు హత్య చేసే స్థాయికి బీఆర్ఎస్ నాయకులు దిగజారినట్లు ఆరోపించారు. హంతుకుడు గిరబోయిన అంజయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆయన భార్య భాగ్యలక్ష్మిని మాత్రం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పదవిలో కొనసాగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనకు రాష్ట్ర ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, ఉడుగుల రమేష్, బళ్ల శ్రీనివాస్, నద్ది సోమిరెడ్డి, గుండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



వరంగల్: వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులు (21, 22 తేదీలు) రాష్ట్ర స్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాష్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోటీలు జరుగనున్న దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పోటీలను జూడో అసోసియేషన్ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ప్రారంభిస్తారన్నారు. తూర్పు ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు కర్ణాటకలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ పరంజ్యోతి ప్రారంభించారు.

మహిళలు, వృద్ధుల కోసం ట్రావెల్-9 టికెట్


ప్రయాణికురాలికి టీ-9 టికెట్ ఇస్తున్న కండక్టర్

హన్మకొండ : మహిళలు, వృద్ధుల కోసం టీఎస్ ఆర్టీసీ ట్రావెల్-9 టికెట్ ప్రవేశపెట్టిందని ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు, హనుమకొండ డిపో మేనేజర్ బాబు నాయక్ తెలిపారు. ఆదివారం నుంచి ఈ టికెట్ అమల్లోకి వచ్చిందని వారు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగించుకోవచ్చన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఈ టికెట్ చెల్లుబాటు అవుతుందని తెలిపారు. రూ.100 చెల్లించి టికెట్ తీసుకుని ఒక రోజులో 60 కిలో మీటర్లు ప్రయాణించొచ్చన్నారు. ప్రతి సర్వీస్‌లో కండక్టర్ వద్ద ఈ టికెట్ అందుబాటులో ఉంటుందన్నారు. దీని ద్వారా ప్రయాణికుడికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందన్నారు. 60 ఏళ్లపై బడిన వృద్ధులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఐటీఐ..చదువులో మేటి!


ప్రభుత్వ ఐటీఐ కాజీపేట

సాంకేతిక విద్యకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివిధ ఉద్యోగాలకు విస్తృత అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. కోర్సు కాల వ్యవధి తక్కువగా ఉండదం..పైగా కళాశాల్లోనే ఏర్పాటు చేసే ప్రాంగణ నియామకాల ద్వారా ఎంపికై జీవితంలో స్థిరపడే అవకాశం ఉండదంతో విద్యార్థులు ఈ విద్యను అభ్యసించదానికి ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో(ఐటీఐలు) 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. ఉన్నత విద్య అవకాశాలు, అప్రెంటీస్ ఎంపికల్లో పారదర్శకత వంటి చర్యలు ఐటీఐ విద్య బలోపేతానికి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీఐ విద్యపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆయా ఐటీఐల్లో సీట్ల వివరాలు..

జయశంకర్ భూపాలపల్లి	84
ఏటూర్‌నాగారం (ఆదివాసీ పిల్లలకు)	63
మహబూబాబాద్	188
ములుగు రోడ్	678
హన్మకొండ	287
కాజీపేట	68

అర్హతలు..

- కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదో తరగతి తప్పిన విద్యార్థులకు ఏడో తరగతి మార్కులు, ఎనిమిదో తరగతి టీసీ ఆధారంగా వెల్డర్ ట్రేడ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.
- 14 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వారు ప్రవేశాలకు అర్హులు.
- అధిక ఉత్తీర్ణతలున్న వారూ అర్హులే.

ఫీజు వివరాలు..

- ప్రభుత్వ ఐటీఐల్లో రూ. 60 కాషన్ డిపాజిట్ కింద చెల్లించాలి.
- ప్రైవేట్‌లో రూ. 7,200 ఫీజు అమల్లో ఉండగా గతేడాది రూ. 15,500 పెంచారు.

సాంకేతిక విద్యకు పెరుగుతున్న ఆదరణ

- పదో తరగతి అర్హతతో ప్రవేశాలు
- అప్రెంటీస్ నియామకాలు మెరుగు
- ఐటీఐ విద్యలో నాణ్యత, నైపుణ్యతకు పెద్దపీట

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. హన్మకొండ, కాజీపేట, ములుగు రోడ్, జయశంకర్ భూపాలపల్లి, ఏటూర్‌నాగారం, మహబూబాబాద్‌లో ఉన్నాయి. వీటిలో 1368 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది కొత్త కోర్సులకు అవకాశం కల్పిస్తే కాజీపేట ఐటీఐ శాఖలో మరో 148 సీట్లు పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఉన్న 34 ప్రైవేట్ ఐటీఐల్లో దాదాపు 5 వేల సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తారు.

అందుబాటులో ఉన్న కోర్సులు ..

పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రస్తుతం 15 రకాల కోర్సులున్నాయి. ప్రభుత్వ విద్యలో రెండు సంవత్సరాల కోర్సుల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఇంజినీరింగ్ మెకానిక్, ఏవో కెమికల్, ఆర్‌అండ్‌ఏసీ, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ప్రధానమైనవి. ఏడాది కోర్సుల్లో డీజిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్, డ్రెస్‌మెకింగ్, కెమికల్ వంటి కోర్సులున్నాయి. ప్రైవేట్ కళాశాలలు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కెమికల్, సివిల్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులకే ప్రవేశాలు నిర్వహిస్తున్నాయి.

నైపుణ్యాలు.. అవకాశాలు..

ఆయా కళాశాలల్లో వృత్తి నైపుణ్యాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ చేపడుతున్నారు. ఫలితంగా ప్రస్తుతం ప్రాంగణ నియామకాలు అధికంగా జరుగుతున్నాయి. గతేడాదిలో జాబ్‌మేళాల ద్వారా 500 మందికి ఉద్యోగాలు లభించాయి. క్యాడ్‌బరి, అపోలో టైర్స్, ఎల్‌అండ్‌టీ, ఓలమ్, ఆర్‌టెల్ కమ్యూనికేషన్, విశాఖ ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు ఉద్యోగాలు కల్పించాయి.

ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తుల పరిశీలన..



ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ఆరంభమైంది. మరోపక్క దరఖాస్తుల పరిశీలన కూడా చురుగ్గా సాగుతోంది. ప్రభుత్వం సంస్కరణల ద్వారా విద్యలో నాణ్యత పెంచే చర్యలుపై దృష్టిసారించింది. భవిష్యత్తులో అభ్యర్థులకు అవకాశాలు పెరుగనున్నాయి. జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి.

– అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ కాజీపేట, ఐటీఐ

మూల మర్రితండా జీపీకి తాళం

- సర్పంచ్ కుమారుడి ఆగడాలపై ప్రజల ఆగ్రహం
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపాటు


గ్రామ పంచాయతీకి తాళం వేస్తున్న తండా వాసులు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం మూలమర్రితండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తండా వాసులు సోమవారం తాళం వేశారు. అనంతరం సర్పంచ్ కుమారుడి ఆగడాలను నిరసిస్తూ తండాలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ తేజావత్ జగినిలాల్ కుమారుడు భరత్‌కుమార్ ఆగడాలు రోజు రోజుకూ అంతులేకుండా పోతున్నాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి వీడీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తే తమ తండాలో మాత్రం సర్పంచ్ తనయుడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి భరత్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు డీఈఈసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఈఈసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశాలకు (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దు మీడియం) ఈనెల 21న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 4 నుంచి 10వ తరగతి వరకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, టీసీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ పీహెచ్‌సీ ధ్రువపత్రాలతో హాజరై పరిశీలన చేయించుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో హరితోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లతో కలిసి సీఎండీ గోపాల్ రావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారంతో తెలంగాణ వృక్షాలు, వనాలతో పచ్చదనంగా మారిందన్నారు. 9వ విడత హరిత హారంలో ప్రతీ ఉద్యోగి భాగస్వాములవ్వాలన్నారు. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రించడానికి హరిత వనాలు అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రంగా నిర్మించడమే మన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, మోహన్ రావు, కిషన్, ప్రభాకర్, రాజుచౌహాన్, కె.ఎన్.గుట్ట, రవీంద్రనాథ్, బీకంసింగ్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ

ఆర్టీసీ లాజిస్టిక్‌తో సత్వర సేవలు

- కరీంనగర్ జోన్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్


సంబురాల్లో భానుకిరణ్, అధికారులు, సిబ్బంది

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్, పార్సిల్, కొరియర్ సర్వీస్‌తో సత్వర సేవలు అందుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ జోన్ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్ అన్నారు. లాజిస్టిక్ సేవలు ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోని లాజిస్టిక్, పార్సిల్ కౌంటర్‌లో ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటకలోని పలు ప్రాంతాలకు 440 కౌంటర్ల ద్వారా అతి తక్కువ ధరకు అతి వేగంగా పార్శిళ్లను చేరవేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా క్విక్ డెలివరీ పథకం ద్వారా కేవలం రూ.99కే మధ్యాహ్నం 12.00 గంటలలోపు బుక్ చేసిన పార్శిళ్లు రాత్రి 9.00 గంటల లోపు చేరేలా, రాత్రి 9.00 గంటలలోపు బుక్ చేసిన పార్శిళ్లను మరునాడు మధ్యాహ్నం 12.00 గంటలలోపు చేరవేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 53 కౌంటర్ల ద్వారా తమ సేవలు అందిస్తున్నామని, త్వరలో వరంగల్‌లో డోర్ డెలివరీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. డోర్ డెలివరీకి ఆసక్తి ఉన్న ఏజెంట్లు సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా లాజిస్టిక్స్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది, హమాలీలను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.వేణుగోపాల్, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డి.శ్రవణ్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, బి.సతీశ్ కుమార్, కౌంటర్ ఇన్‌చార్జి జి.రవి పాల్గొన్నారు.


బైక్‌ను ఢీకొన్న లారీ

- వర్ధన్నపేట మండల కోఆప్షన్ సభ్యుడి దుర్మరణం


పాషా (ఫైల్)

మామునూరు/వర్ధన్నపేట : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై లారీ.. బైక్‌ను ఢీకొనడంతో మండల కోఆప్షన్ సభ్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మామునూరు శివారు టీఎస్ఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎండీ.పాషా(72) మండల కోఆప్షన్ మెంబర్‌గా కొనసాగుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నూర్జాహబేగం ఐదేళ్ల క్రితం, పెద్ద కుమారుడు బాషమియా గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం చిన్నకుమారుడు సలీంపాషా వరంగల్‌లో టైలర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో పాషా ఆదివారం బైక్‌పై ఇల్లంద నుంచి వరంగల్‌లోని చిన్న కుమారుడు వద్దకు వచ్చాడు. సోమవారం ఉదయం ఇల్లందకు బయల్దేరాడు. మామునూరు టీఎస్ఎస్పీ బెటాలియన్ బంక్‌లో పెట్రోల్ పోసుకుని వెళ్తూ రహదారి క్రాస్‌చేస్తుండగా వరంగల్ నుంచి ఇల్లంద వైపునకు వెళ్తున్న లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సైలు రాజేష్‌రెడ్డి, కృష్ణవేణి ఘటనా స్థలికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అరూరి రమేష్ ఎంజీఎం మార్చురీకి వద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో యువకుడి మృతి


కిరణ్ (ఫైల్)

వర్ధన్నపేట: ఓ యువకుడు చిన్న వయస్సులోనే గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఘటన వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. వర్ధన్నపేటకు చెందిన మేడ కిరణ్(30) బీటెక్ పూర్తి చేసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కిరణ్‌ను వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 20న నిర్వహించే అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సోమవారం రాత్రి తెలిపారు. దూరవిద్య ఎమ్మెస్సీ మ్యాథ్స్ ఫైనల్ ఇయర్ పేపర్ కూడా వాయిదా వేశామని, ఆ పేపర్ పరీక్షను జూలై 3వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం

- సోమవారం ఉదయం నుంచి కార్యక్రమాలు ప్రారంభం
- శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దాస్యం


అమ్మవారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారికి సహస్రకలశాభిషేకం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు, అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, తదితర పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన చీఫ్ విప్ వినయ్‌భాస్కర్..

ప్రభుత్వ చీఫ్‌విప్, హన్మకొండ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శాకాంబరీ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్, సారయ్యకు ఈఓ శేషు భారతి, భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

శోభాయమానంగా సహస్రకలశాభిషేకం..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణం మమ అంటూ పలికారు. అనంతరం అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. కొమురవెల్లి దేవాలయం వేద పండితుడు వేలేటి సిద్ధరామశర్మ ద్వివేది, భద్రకాళి దేవాలయ ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, పార్నంది నర్సింహామూర్తి, సామవేద పండితుడు ప్రదీప్‌శర్మ, అర్చకులు, భద్రకాళి సాంగ అగమ వేద పాఠశాల విద్యార్థులు అభిషేకకార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, వరంగల్‌కు చెందిన బాసాని విశ్వప్రకాశ్, శోభ దంపతులు సహస్రకళశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో అవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం,తీర్థప్రసాదవితరణ జరిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.5 లక్షల విలువైన నగలు, రూ.75వేల నగదు అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ, క్లూస్‌టీమ్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు పొన్నం లింగం, శ్రీలత దంపతుల కథనం ప్రకారం.. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. లింగం, శ్రీలత స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉంటున్నారు. అయితే శ్రీలత అమ్మగారి ఊరు ఐనవోలు మండలం సింగారం గ్రామానికి దంపతులిద్దరూ శనివారం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.75వేల నగదును అపహరించారు. సోమవారం ఉదయం దంపతులు ఇంటికి వచ్చేసరికి గేటుపక్కన ఉన్న ఇనుపరాడ్ వంగి ఉండడం, పూలకుండి కింద పడి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంటి వెనుక తలుపు తెరిచి ఉంది. బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 8 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, కమ్మలు, పుస్తె మొత్తం 8 తులాల బంగారు నగలు, వెండి పట్టగొలుసులు, మట్టెలు, బ్రాస్‌లెట్ మొత్తం 20 తులాల వెండి ఆభరణాలు, రూ.75వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎ.రాఘవేందర్, ఎస్ఐ శ్రవణ్‌కుమార్ అక్కడకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ

విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. బాధితుడు లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సీఐ

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే..

స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, ఏసీపీ కార్యాలయానికి సమీప కాలనీలోని ఇంటిలో చోరీ జరగడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు హల్‌చల్ చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీని, పెట్రోలింగ్‌ను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.